క్లుప్తంగా

వార్షిక పరీక్షలపై అవగాహన

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు గురువారం మోటివేటర్ సుంధిళ్ల రమేశ్ ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్ష సమయంలో పాటించాల్సిన మెళుకువలు వివరించారు. పదో తరగతి అనంతరం తీసుకోవాల్సిన కోర్సులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత, సీఆర్టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీసీలకు రుణాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: బీసీ రుణాలు మంజూరు చేయాలని కోరుతూ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి సజీవన్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఇస్తారి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బీసీ ఒకేషనల్ రుణాల కోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న 400 మందికి రుణాలు రాలేదని, తాజాగా రాజీవ్ యువ వికాసం రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న రాథోడ్ రమేశ్

కెరమెరి: దివ్యాంగుడు శ్రీకాంత్‌కు న్యాయం చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ (జాతీయ మానవ హక్కుల కమిటీ) జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రెను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. లక్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కొంత కాలంగా వెన్నుపూస వ్యాధితో ఎంతో బాధపడుతన్నాడని, సదరం సర్టిఫికెట్ కోసం అధికారులు చుట్టూ తిరిగినా.. అధికారులు స్పందించడం లేదన్నారు. తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

వారసంత వేలం వాయిదా

ఆసిఫాబాద్‌అర్బన్: రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే సంత, వాసంతలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి దినసంత, వారసంత వేలం పాటను ఈనెల 22న శనివారం ఉదయం 10 గంటల నుంచి వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

వాంకిడి: వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సరండి ఎక్స్ రోడ్ వద్ద బిర్యాణి హోటల్‌లో ఆసిఫాబాద్ మండలంలోని రవిచంద్రకాలనీకి చెందిన కొండ సంతోశ్, పస్తం అశోక్ అనే ఇద్దరూ యువకులు ఈనెల 18న హోటల్ పనిచేస్తున్న జమీర్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో జమీర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వైద్య సేవలపై ఆరా



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

జైనూర్: గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులు రమణ, శ్రీనివాస్‌లు ఆరా తీశారు. గురువారం జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రిల్లో వచ్చే రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత, మందుల కొరత వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధార్థ్, మండల వైద్యాధికారి నాగర్‌గోజే అశోక్, ఉదయ్ కిరణ్, మురళి, అరవింద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమాన్ దీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: ఎప్రిల్ 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్ధమండల దీక్షలను ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాలధారణ చేసే భక్తులు ఉదయం 6 గంటలకు ఆలయానికి చేరుకోవాలని కోరారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

కెరమెరి: పదో తరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, మూడు గిరిజన ఆశ్ర ఉన్నత పాఠశాలలు ఉండగా వాటిల్లో 336 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కెరమెరిలో 168 మంది విద్యార్థులు, మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 168 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. గురువారం ఆయా పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేశారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన 57 మంది, చేడ్వాయి ఉన్నత పాఠశాలకు చెందిన 26 మంది, కేజీబీవీకి చెందిన 34 మంది, ఆశ్రమ పాఠశాల ఎల్లూర్ నుంచి 25 మంది, ఆశ్రమ పాఠశాల కమ్మర్‌గా నుంచి 05 మంది మొత్తం 147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

కాగజ్‌నగర్ రూరల్: శుక్రవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరం 907 మంది బాలురు, 748 మంది బాలికలు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మొత్తం 1655 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, పట్టణంలో ఆరు, రూరల్ ఏరియాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మంచినీరు, విద్యుత్, బెంచీలు మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 266 మంది విద్యార్థులున్నారు. వీరి కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 150 మంది, కేజీబీవీలో 116 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని సీఎస్‌లు రామచంద్రారెడ్డి, అమరేందర్ రెడ్డిలు తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల డీపీఐపీ పాఠశాల, కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 635 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

చింతలమానెపల్లి: పదో తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. 207 మంది విద్యార్థులకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. గురువారం పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో జయరాజ్ పరిశీలించారు.



పరీక్ష కేంద్రంలో నెంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రభాకర్



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పశువులకు అందని వైద్యసేవలు

- మృత్యువాత పడుతున్న పశువులు
- ఇన్‌చార్జి వైద్యుడే దిక్కు
- పశువులను అమ్ముకుంటున్న రైతులు

లింగాపూర్: మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నా.. అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. మండలంలో పశువైద్యశాలలో సౌకర్యాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే సరైన సమయంలో వైద్య అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు, పశుపోషకులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీరు అందక అల్లాడుతున్నాయి.

మండలంలోని పశుసంపద..

మండలంలో 2018 లెక్కల ప్రకారం ఆవులు 10,381, గేదెలు 704, మేకలు 8,600 వరకు ఉన్నాయి. పశు వైద్యశాల లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధులు వచ్చినప్పుడు ప్రైవేట్ మెడికల్ షాప్‌ల్లో మందులు కొనుగోలు చేయాల్సిన వస్తుందని వాపోతున్నారు. ప్రైవేట్‌లో మందులు కొనలేని పరిస్థితులలో సిర్పూర్(యూ) ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి తరలిస్తున్నారు. మామిడిపల్లి గ్రామంలో ఒకే ఒక మైత్రి సెంటర్ నిర్వహిస్తున్నారు. ఒక్కడే నిర్వాహకుడు అన్ని పశువులకు చిన్నపాటి చికిత్స అందిస్తున్నాడు.

పశువుల బీమాకు మంగళం..

ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బీమా పథకం 2016 వరకు కొనసాగింది. అప్పటి నుంచి బీమా పథకం ఆమలు చేయకపావడంతో రైతులు నష్టపోతున్నారు. పశువుల బీమా మళ్లీ ఆమలు చేయాలని ఆయా రైతులు, పశుపోషకులు కోరుతున్నారు. అలాగే పెద్ద పశువైద్యశాల నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యుడు

వైద్యం అందడం లేదు



మండలంలో పశువైద్యశాల లేకపోవడంతో సరైన సమయంలో వైద్యం అందడం లేదు. దీంతో సిర్పూర్ పశువుల ఆసుపత్రికి జీవాలను తరలిస్తున్నాం. సరైన సమయంలో వాహనాలు దొరక్క, వైద్యం అందక పశువులు మృత్యవాత పడుతున్నాచి. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

–ఆదే బాలు, లింగాపూర్

'ఈటల'ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

చింతలమానెపల్లి: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈటల రాజేందుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిజేశారు. జిల్లాలోని పలు సమస్యలు, పార్టీ విషయాలను ఈటల దృష్టికి తీసుకెళ్లారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న దోని శ్రీశైలం

మహాధర్నా విజయవంతం చేయండి

బెజ్జూర్: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో పోడు సమస్యలపై నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు సిడాం సకారాం కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 22 గ్రామ పంచాయతీల్లో పోడు రైతులను అటవీ శాఖ అధికారులు ఇబ్బంది గురిచేస్తున్నారని అన్నారు. గతేడాది సాగు చేసిన పంట కట్టెను తొలగించవద్దని అటవీశాఖ అధికారులు రైతులకు తెలియజేశారని, అంతేకాకుండా పోడు భూముల్లో ట్రాక్టర్లతో దున్నకుండా, ట్రాక్టర్లు వెళ్లకుండా ట్రాక్టర్ యజమానులకు నోటీసులను అందిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ మండల గౌరవ అధ్యక్షుడు సకారాం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ డోకే వెంకన్న, బషారత్ ఖాన్, పుల్లూరి సతీష్ కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలే బీజేపీ లక్ష్యం

కౌటాల: దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడమే బీజేపీ లక్ష్యమని వన్ నేషన్-వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండలాధ్యక్షుడు కంబాల విజయ్, నాయకులు వాసుపటేల్, చందు, భీమయ్య, తిరుపతి, రవిపాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

కౌటాల: మండల కేంద్రంలో గురువారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక కుమురం భీం చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా సంబురాలు జరుపుకున్నారు. వర్గీకరణ బిల్లుకోసం మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిట్టల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క శంకర్, బ్రహ్మయ్య, మూర్తి, రాజేశ్, బానయ్య పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చండి

కెరమెరి: అధిక లోడ్‌తో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతుందని ఎక్కువ కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని మండలానికి చెందిన రైతులు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శేశారావు, డీఈ వీరేశాను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు అయ్యూబ్, శాకీర్, సుభాష్, షుకుర్, గౌసుద్దిన్, కుత్‌బోద్దిన్ తెలిపారు.



ఎస్ఈ, డీఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు



తవ్వారు.. వదిలేశారు

లింగాపూర్: మండల కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నమూన కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించి, గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో మూగ జీవాలు అక్కడే సంచరిస్తుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండుతున్న వరి..!



ఇతని పేరు రౌతు లస్మయ్య కుంచవెల్లి గ్రామం. యాసంగిలో 5 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. బోరు బావి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోవడంతో పదిహేను రోజుల వరకు నీటితడి లేదు. దీంతో వరి ఎండిపోయే దశకు చేరింది. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదని వాపోతున్నాడు.



మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన రౌతు రాజన్న మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. వరికి తడి లేక పదిహేను రోజులైంది. ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. వరి ఎండి పోయింది. ప్రస్తుతం వరికి తడి అందిస్తున్నా.. ఎలాంటి ఆశలు లేవు. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి ఉంటే పంట ఎండిపోయేది కాదు.



సాగునీరు లేక ఎండిపోతున్న వరి

- కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- పంటలకు అందని సాగునీరు

దహెగాం: రోజు రోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండడంతో యాసంగిలో సాగు చేస్తున్న పంటలకు తడి అందక పంటలు ఎండిపోతున్నాయి. లో, హై వోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడంతో, భూగర్భజలాలు అడుగంటిపోవడం, చెరువులు, కుంటల నుంచి కాల్వల ద్వారా సాగు నీరు అందక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పదిహేను రోజులుగా వరికి తడి లేక సుమారు 40 ఎకరాల వరకు వరి ఎండి పోయిందని వాపోతున్నారు. సుమారు 70 శాతం వరి ఎండి పోయిందని ప్రస్తుతం నీటి తడి అందిస్తున్నామని పచ్చదనం వచ్చేందుకు మందులు వేస్తున్నామన్నారు. ఎండిపోయిన తరువాత పెట్టుబడి వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించక పోవడం వల్లే పంటలకు నష్టం జరుగుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ చేనులో కందకాలు, రాళ్ల కట్టాల నిర్మాణం, చెక్‌డ్యాం పనులు సాగుతున్నాయి. గురువారం ఉపాధి పనులను ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామీణ రైతులు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు జాదవ్ విఠల్, మహేందర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

నార్నూర్: అధైర్య పడొద్దు ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రైతు జాదవ్ వెంకట్ రావుకు సబ్ కలెక్టర్ యువరాజ్ మూర్మ భరోసా ఇచ్చా రు. గురువారం మండలంలోని గుండాల గ్రా మ సమీపంలో గోధుమ కాలిపోయిన చేనును ఆయన పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



ఆసిఫాబాద్‌రూరల్: అధ్యాపకులతో గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు

ఇంటర్మీడియెట్ పరీక్షలు గురువారం ముగిశాయి. వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఆనందంగా ఇంటిబాట పట్టారు. ఒకేషనల్ చదువుతున్న విద్యార్థులకు మాత్రం 22వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఆసిఫాబాద్ మోడల్ స్కూల్, రెబ్బెన, కౌటాల కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి.

– ఆసిఫాబాద్‌రూరల్ /దహెగాం



దహెగాం: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

వంద శాతం పన్ను వసూలు చేయాలి

తిర్యాణి: గ్రామాల్లో వందశాతం పన్ను వసూలు చేయాలని డీపీవో భిక్షపతి గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వేముల మల్లేశ్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లేశ్